క్లుప్తంగా

కృష్ణా కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం


మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి శనివారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు వారు స్వయంగా వడ్డించారు. విద్యార్థులకు ఆరోగ్యంగా ఉండేలా పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. మెను ప్రకారం రుచికరమైన ఆహారాన్ని అందించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా ఫిబ్రవరి 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను ఏయూ వైస్ చాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఈఎస్ ధనంజయరావు శనివారం కార్యాలయంలో ఆవిష్కరించారు. విభాగ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా అడ్వాన్సెస్ ఇన్ జియో ఫిజిక్స్ ఫర్ ఏ సస్టైనబుల్ ఫ్యూచర్ ఎనర్జీ, ఎన్విరాన్మెంట్ అండ్ నేచురల్ రిసోర్సెస్ అనే అంశంపై ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. పోస్టర్ ఆవిష్కరణలో అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, విభాగాధిపతి ఆచార్య సీవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి, వేంకటేశ్వరస్వామి



ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని సెక్టార్–6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని పురస్కరించుకొని 19వ పాశుర విన్నపం సందర్భంగా 365 ఒత్తులతో దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామిని పచ్చకర్పూరంతోను, సుబ్రహ్మణ్యస్వామిని లిల్లీపువ్వుల దండలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామివార్లకు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉపాధి యోగం


యోగ సాధన చేస్తున్న విద్యార్థులు



యోగా గురువులుగా యువతరం

ఆరోగ్యం, ఆదాయం





ఏయూక్యాంపస్ : మనసుకు ఆరోగ్యాన్ని అందించేది శారీరక వ్యాయామం. మన భారతీయ సనాతన సంస్కృతిలో యోగా ఎంతో విశిష్టమైనది. మనస్సును, శరీరాన్ని సమన్వయం చేసే శక్తి దీనికి ఉంది. పతంజలి మహర్షి అందించిన యోగ విద్య నేడు విశ్వవ్యాప్తం అయింది. అంతర్జాతీయ స్థాయిలో దీనికి ప్రాచుర్యం, ప్రాముఖ్యత పెరుగుతోంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచడం, ఒత్తిడి, నిరాశ, అశాంతిని యోగా తగ్గిస్తుంది. యోగాతో ఉపాధి మార్గంగా మార్చుకుంటున్న వారు పెరుగుతున్నారు. కేవలం యోగాలో కోర్సులు పూర్తిచేసి, నిపుణుల పర్యవేక్షణలో తర్ఫీదు పొంది యోగ గురువులుగా మారుతున్నారు. బీచ్‌రోడ్డులోని యోగ కేంద్రంలో విద్యను నేర్చుకున్న పలువురు ఇప్పటికే యోగాలో గురువులుగా మారడం, స్వయంగా యోగ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడం జరిగింది. కొంత మంది చైనా, హాంకాంగ్ తదితర దేశాలలో సొంతంగా యోగా కేంద్రాలను సైతం నెలకొల్పి ఉన్నతంగా స్థిరపడ్డారు. మరికొంతమంది దేశ వ్యాప్తంగా విభిన్న ప్రాంతాలలో యోగ శిక్షకులుగా ఉపాధిలో స్థిరపడుతున్నారు.


యోగ సాధన చేస్తున్న విద్యార్థులు

ఆరోగ్యం, సంతోషం



ఇతర ఉపాధి అవకాశాలతో పోల్చితే యోగా ఎంతో ప్రత్యేక స్థానం ఉంది. యోగ నేర్చుకోవడం వలన మన ఆరోగ్యం మెరుగవుతుంది. దీనిని ఉపాధిగా చేసుకోవడం వలన ఆదాయం సమకూరుతుంది. ఇతరులకు సైతం ఆరోగ్యాన్ని అందిస్తున్నామనే సంతృప్తి ఈ వృత్తిలో ఉంది. నిత్యం ఇతరులకు యోగాను నేర్పించడం వలన మన ఆరోగ్యం, ఇతరుల ఆరోగ్యం మెరుగవుతాయి. నిత్యం వేద విద్యార్థులకు, పాఠశాల విద్యార్థులకు, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు యోగాను నేర్పుతున్నాను.

–జి.వెంకటరమణ, సింహాచలం

శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నా



అనకాపల్లిలో ప్రత్యేకంగా యోగ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నా.. ఏయూకు అనుబంధంగా పనిచేస్తూ కోర్సులను సైతం నిర్వహిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో సైతం యోగాకు ప్రాచుర్యం, ప్రాముఖ్యత పెరిగాయి. మా వద్ద శిక్షణ పొందిన వారు విదేశాలలో సైతం స్థిరపడి, యోగను విశ్వవ్యాప్తం చేస్తున్నారు.

–కె.బాబూరావు, అనకాపల్లి


యోగాను ఉపాధిగా మార్చుకోవచ్చు



నేడు యోగాకు ఎంతో ఆదరణ లభిస్తోంది. ఏయూ నుంచి యోగాలో పీజీ, పీహెచ్‌డీ పూర్తిచేశాను. ప్రస్తుతం యోగా ఇన్‌స్టిట్యూట్‌కు ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాను. వివిధ ప్రాంతాల్లో సొంతగా యోగ శిక్ష కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడం, యోగ బోధన వృత్తిగా చేసుకోవడం, యోగ శిక్షణ అందించడం వంటి ఉపాధి అవకాశాలు ఉన్నాయి. సరైన విధానంలో నేర్చుకుని, శిక్షణ అందిస్తే ఆదరణ అపారం.

–డాక్టర్ పి.సుమన,ప్రిన్సిపాల్, శ్రీ వెంకటేశ్వర యోగ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, తిరుపతి

యోగాతో అవకాశాలు



యోగాలో దేశీయంగానే కాకుండా విదేశాలలో సైతం ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే మా వద్ద శిక్షణ పొందిన, కోర్సులు పూర్తిచేసిన వారు విదేశాలలో యోగ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. మెరుగైన వేతనాలు, ఆర్థికంగా బలోపేతం కావడానికి యోగా మంచి మార్గంగా నిలుస్తోంది.

–ఆచార్య కె.రమేష్ బాబు, యోగ విలేజ్, బీచ్‌రోడ్డు

ఏయూ షూటింగ్ జట్లు ఎంపిక


క్రీడాకారులతో ఆచార్య విజయ మోహన్

విశాఖ విద్య: ఆంధ్రాయూనివర్సిటీ పురుషులు, మహిళల షూటింగ్ జట్లు ఎంపిక శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పంజాబ్ యూనివర్సిటీ చండీఘర్‌లో ఈనెల 8 నుంచి 18 వరకూ షూటింగ్ పోటీలు జరుగుతాయన్నారు. ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ ఆచార్య ఎ. పల్లవి మాట్లాడుతూ షూటింగ్ పురుషులు, మహిళలు జట్లు ప్రతిభ సాధించి యూనివర్సిటీకి పేరు తేవాలన్నారు. ఏయూ దూరవిద్యా కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దొరబాబు, షూటింగ్ కోచ్ ఆర్.కె. స్పందన, మేనేజర్ బి.వి. మల్లేష్ పరిశోధకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల సందడి


రాజేంద్రనగర్ అంగన్వాడీ కేంద్రంలో కూరగాయలు విక్రయిస్తున్న చిన్నారులు

ఆరిలోవ: చినగదిలి సెక్టార్ జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి రాజేంద్రనగర్ అంగన్వాడీ కేంద్రంలో టీచర్లు శనివారం ఈసీసీఈ కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ చిన్నారులతో కూరగాయలతో అంకెలు ఏర్పాటు చేశారు. అంకెలతో చిన్నారులను ఆటలాడించారు. చిన్నారులకు పెద్దల వేషధారణ వేయించి మార్కెట్‌లో కూరగాయలు విక్రయించడం, కొనడం తదితర కార్యక్రమాలు చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కామేశ్వరి, అన్నపూర్ణ, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

జన సాగరం






నేవీ ఉత్సవాలు వీక్షించేందుకు తరలివచ్చిన సందర్శకులు





ఏయూక్యాంపస్: నేవీ విన్యాసాల నేపథ్యంలో సాగరతీరం జన సంద్రంగా మారింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి నగరవాసులు పెద్దసంఖ్యలో విన్యాసాలను తిలకించడానికి వచ్చారు. ప్రత్యేక పాస్‌లు ఉన్నవారు వేదిక పక్కనే ఉన్న గ్యాలరీలలోకి అనుమతించారు. ఇతరులను ముందుగా ఏర్పాటు చేసిన ఇసుక తిన్నెలపైన ఏర్పాటు చేసిన గ్యాలరీలలో కూర్చుని కార్యక్రమాన్ని వీక్షించారు. సుమారు రెండు గంటల పాటు సాగిన ఈ విన్యాసాలు విశాఖ వాసులకు సరికొత్త అనుభూతులను పంచాయి. విన్యాసాలను వీక్షించడానికి వచ్చిన వారిని తనిఖీ చేసి, వారి వద్ద పాసులు ఉంటేనే వేదిక వద్దకు అనుమతించారు. బీచ్‌రోడ్డు కురుసుర మ్యూజియం దాటిన తరువాత నుంచి అడుగడుగునా పోలీసులు, నేవీ సిబ్బంది తనిఖీలు జరిపారు. మధ్యాహ్నం ఒంటిగంట తరువాత బీచ్‌రోడ్డులోకి వాహనాల ప్రవేశాన్ని పూర్తిగా నిలిపివేశారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్వయంగా వేదిక వద్ద ఉండి భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. నేవీ సిబ్బంది పెద్దసంఖ్యలో తమ కుటుంబ సభ్యులతో కలిసి విన్యాసాలను తిలకించారు. ఆర్కే బీచ్ సమీపంలోని అపార్ట్‌మెంట్ వాసులు తమ బాల్కనీలు, టెర్రస్‌పై నుంచి విన్యాసాలను తిలకించారు.

భవిత కేంద్రంలో బ్రెయిలీ జయంతి


భవిత కేంద్రంలో కో ఆర్డినేటర్‌కు స్టిమ్యులేషన్ మిషన్ అందజేస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి తోటగరువు ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ పాల్గొని ఉపాధ్యాయులతో కలిసి లూయిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి రాజేశ్వరరావు దంపతులు కేంద్రంలో సీడబ్ల్యూసీఎన్ పిల్లలకు కోసం స్టిమ్యులేటింగ్ మిషన్, 40 దుప్పట్లు డీఈవో చేతులు మీదుగా భవిత కో ఆర్డినేటర్ గీతకు అందజేశారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ఏపీసీ జె.చంద్రశేఖర్, ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ, పాఠశాల హెచ్ఎం విశ్వనాథం, ఉపాధ్యాయులు రమేష్, మహలక్ష్మి, సలీమ పాల్గొన్నారు.

జగన్నాథ స్వామికి ప్రత్యేక పూజలు


భజన చేస్తున్న భక్తులు

ఏయూక్యాంపస్: స్థానిక చినవాల్తేరు జగన్నాథ స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. జగన్నాథస్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు. జనవరి 13వ తేదీ వరకు ఇవి జరుగుతాయి. దనిలో భాగంగా శనివారం సాయంత్రం స్థానికులు పలు భజన గీతాలను ఆలపించారు. దీంతో ఆలయ పరిసరాలలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయంలో ఉదయ వేళలో అర్చన, అష్టోత్తరనామార్చన, సాయంత్రం వేళలలో లలితా పారాయణ, భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ జరుపుతున్నారు. ఈ నెల 9న పంచామృతాభిషేకం, విశేష పుష్పార్చన, 10వ తేదీన ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని విశేష పుష్పార్చన, 13న భోగి రోజున గోదా కళ్యాణం జరుపుతారు. గ్రామస్తులచే అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తారు.

ఏపీఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ఘన స్వాగతం


విద్యాసాగర్‌ను సత్కరిస్తున్న ఎన్‌జీవో నేతలు

మద్దిలపాలెం: నూతనంగా ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి విశాఖ వచ్చిన ఎ.విద్యాసాగర్, ఏపీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షులు, ఏపీజేఏసీ చైర్మన్ కేవీ శివారెడ్డిలను నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికినట్టు ఎన్ఎంయూఏ రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్ తెలిపారు. అలాగే నగరానికి విచ్చేసిన శాసన మండలి సభ్యులు పరుచూరి అశోక్ బాబును విశాఖ ఎయిర్ పోర్ట్‌లో ఘన స్వాగతం పలికామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి మోహన్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించిన అశోక్ బాబును మర్యాద పూర్వకంగా కలిశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అల్లు సురేష్ నాయుడు, జిల్లా కార్యదర్శి బి.నీలకంఠం, డివిజనల్ కార్యదర్శి ఏకే శివాజీ, గాజువాక కార్యదర్శి శంకరరావు, వాల్తేర్ కార్యదర్శి ఆర్.వసంత రావు, మద్దిలపాలెం కార్యదర్శి చిన్న సింహాచలం, కార్యదర్శి జేఎస్ఎన్ రాజు, జిల్లాలో అన్ని డిపో కమిటీలు సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులు తప్పిపోకుండా 'ఆర్ఎఫ్ఐడీ'తో పర్యవేక్షణ


చిన్నారుల వివరాలు సేకరిస్తున్న పోలీసులు


చిన్నారులకు క్యూఆర్ కోడింగ్ బ్యాండ్ కడుతున్న పోలీసులు

మద్దిలపాలెం: నేవీ విన్యాసాలు తిలకించేందుకు తరలివచ్చిన జనసంద్రంలో చిన్నారులు తప్పిపోకుండా.. తొలిసారిగా రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్(ఆర్ఎఫ్ఐడీ)ను పోలీసులు విజయవంతంగా వినియోగించారు. నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో ఐదేళ్లలోపు పిల్లల చేతికి పోలీసులు క్యూఆర్ కోడ్ ట్యాగ్‌లను కట్టారు. బ్యాండ్‌ను చేతికి కట్టే సమయంలో, మొబైల్ నంబర్‌తో సహా తల్లిదండ్రుల వివరాలను సేకరించారు. వీటిని క్యూఆర్ కోడ్‌లో నిక్షిప్తం చేసి సర్వర్‌లో భద్రపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సుమారు 2,000 మంది పిల్లలకు ఈ క్యూఆర్ కోడ్ ట్యాగ్‌లు కట్టినట్టు వివరించారు.

బయో డైవర్సిటీ పార్క్‌ను సందర్శించిన విద్యార్థులు


పార్కులో విద్యార్థులు

బీచ్‌రోడ్డు: ఓ ప్రైవేటు విద్య సంస్థకు చెందిన విద్యార్థులు పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌ను శనివారం సందర్శించారు. పార్క్ పర్యవేక్షకుడు రామ్మూర్తి వివిధ రకాల మొక్కల ప్రముఖ్యతను వివరించారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, పెరిగే వాతావరణాన్ని విద్యార్థులకు వివరించారు.

ఇన్‌కమ్ టాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలకు ఇన్‌కమ్ టాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం వైస్ చాన్సలర్ శశిభూషణరావును కలసి తమ సమస్యలను విన్నవించారు. ఆంధ్ర యూనివర్సిటీలో పని చేస్తున్నటువంటి అసిస్టెంట్ ప్రొఫెసర్, కాంట్రాక్ట్ ప్రొఫెసర్లకు ఇన్‌కమ్ టాక్స్ కట్ చేయడం లేదని, కానీ అతిథి అధ్యాపకు కట్ చేయడం ఎంతవరకు సబబు అని తెలిపారు. గెస్ట్ ఫ్యాకల్టీ విషయంలో ఇన్‌కమ్ టాక్స్ మినహాయింపు చేయకుండా, పూర్తి పారితోషకం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అతిథి అధ్యాపకుల అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఎం.సురేష్ మీనన్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ దాస్ దేవా, శ్రీను, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ శిరీష్, డాక్టర్ వెంకట నాయుడు, డాక్టర్ గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ మహిళా యవతకు శిక్షణ

ఆరిలోవ: నగరంలో నిరుద్యోగ మహిళా యువతకు పైనాపిల్‌కాలనీ వద్ద జిల్లా మహిళా ప్రాంగణంలో ఈనెల 19 నుంచి చేతి వృత్తుల్లో రెండు నెలల శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమల శనివారం తెలిపారు. స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. నర్సింగ్, రిటైల్‌లో రంగంలో శిక్షణ ఇస్తామన్నారు. నర్సింగ్‌లో శిక్షణ కోసం పదో తరగతి, రిటైల్‌లో శిక్షణ కోసం 8వ తరగతి చదువుకున్న మహిళలు అర్హులని తెలిపారు. ఆయా రెండు కోర్సులకు దరఖాస్తులు చేయదలచినవారికి 18 నుంచి 36 సంవత్సరాల మధ్య వయసు ఉండాలన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 12లోగా మహిళా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.